సాక్షి
ప్రకాశం
బుధవారం, 20, నవంబర్, 2024



పత్తి రైతుకు ధరాఘాతం

పత్తి ధరలు రైతులను నిరాశా నిస్పృహలకు గురి చేస్తున్నాయి. ఈ ఏడాది పెట్టుబడి సొమ్ము కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- 8లో..



ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

మోటారు సైకిల్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన దర్శి మండలం తూర్పు వీరాయపాలెం లో మంగళవారం జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
32/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సాంప్రదాయ క్రీడల్లో రాణించాలి

● ఏకేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు



మహిళా క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రిజిస్ట్రార్ బి.హరిబాబు

ఒంగోలు సిటీ: విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని, పోటీతత్వాన్ని పెంపొందించేందుకు చదువుతో పాటు సాంప్రదాయక క్రీడల్లో బాగా రాణించాలని ఆంధ్రకేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు అన్నారు. ఏకేయూ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన మహిళల ఐసీటీ కబడ్డీ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ బి.హరిబాబు పాల్గొని మాట్లాడుతూ క్రీడల్లో మహిళలు ఆసక్తి కనబరచాలన్నారు. క్రీడలు శారీరక ఆరోగ్య విషయంలో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఆటల పోటీల్లో గెలుపోటములు సహజమేనని, ప్రతి ఒక్క క్రీడాకారిణి క్రీడాస్ఫూర్తితో ఆడాలన్నారు. అంతకుముందు అంతర కళాశాలల మహిళల కబడ్డీ టోర్నమెంట్ పోటీలను రిజిస్ట్రార్ హరిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డీడీ డాక్టర్ దేవి వరప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన రావు, డీన్ ప్రొఫెసర్ సోమశేఖర, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే నెల 8న టీటీడీ భగవద్గీత పోటీలు

ఒంగోలు మెట్రో: తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డిసెంబర్ 8వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు స్థానిక మంగమూరు రోడ్డులోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం, రఘుపథంలో భగవద్గీత పోటీలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ రామకృష్ణ తెలిపారు. భగవద్గీత 6 వ అధ్యాయం ఆత్మ సంయోగంలో 6, 7 తరగతులు ఒక గ్రూప్ గా, 8,9 తరగతులు రెండో గ్రూప్ గా పోటీలు నిర్వహిస్తారు. సంపూర్ణ భగవద్గీతలో 18 సంవత్సరాల లోపు వారు ఒక గ్రూప్ గా, 18 పై బడినవారు రెండో గ్రూప్ గా పోటీలు నిర్వహిస్తారు. మొత్తం నాలుగు గ్రూపులలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇస్తారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈ నెలాఖరు లోపు తమ వివరాలు వాట్సాప్ నెం: 9849203399 కు పంపవచ్చు. మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన సెల్: 7386662048 ను సంప్రదించాలన్నారు.

366 శివలింగాలతో మహా లింగార్చన

● వైభవంగా నాయి బ్రాహ్మణ కార్తీక వన సమారాధన



కార్తీక వన సమారాధనలో నాయి బ్రాహ్మణులు

ఒంగోలు మెట్రో: స్థానిక వీరన్ ఎన్‌కే గ్రీన్ సిటీ కందులూరులో నాయి బ్రాహ్మణ కార్తీక వన సమారాధన మహా లింగార్చన భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా వేదికపై ఏర్పాటు చేసిన 366 శివలింగాలతో 11 ఆవరణలతో ఏర్పాటు చేసి మహాలింగ అర్చన సామూహికంగా భారతుల శ్రీనివాస శర్మ నిర్వహించారు. అనంతరం కార్తీక వన సమారాధనలో నాయి బ్రాహ్మణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలి

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి

ఒంగోలు సిటీ: ఒంగోలు విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఒంగోలులోని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ భవనంలో జిల్లా పట్టణ, తాలుకా సంఘ నాయకులు సమావేశమయ్యారు. సమావేశంలో 2025 డైరీకి సంబంధించి యాడ్స్, సభ్యత్వ నమోదు వేగవంతంపై చర్చించారు. ఒంగోలులో ఖాళీగా ఉన్న ఆఫీస్ బేరర్ పోస్టులను వెంటనే ఈసీ మీటింగ్ జరుపుకొని భర్తీ చేసుకోవాలన్నారు. డీఈఓ కార్యాలయంలో జూనియర్ సహాయకులుగా పనిచేస్తున్న కె.వి.సురేష్‌కు నిబంధనల ప్రకారం సీనియర్ సహాయకునిగా పదోన్నతి కల్పించాలని డీఈఓను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వరకుమార్, కోశాధికారి విజయభాను, పట్టణ ఉపాధ్యక్షుడు రామ్మోహనరావు యాదవ్, పట్టణ అధ్యక్షుడు రంగారెడ్డి పాల్గొన్నారు.

పోస్టులు మేస్త్రీ..!



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిరుద్యోగులపై విరుచుకుపడుతోంది. ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించింది. మరి కొందరితో బలవంతంగా రాజీనామాలు చేయించింది. తాజాగా ఒంగోలు నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న మేస్త్రీలపై కన్ను పడింది. కూటమి నేతల ఒత్తిడితో కార్పొరేషన్ అధికారులు 108 మందిని నోటిమాటతో తొలగించారు. కొత్తవారిని నియమించే విషయంలో భారీ ఎత్తున డబ్బులు చేతులు మారుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒంగోలుకు చెందిన ముఖ్య నేతతో పాటు అటు బీజేపీ, ఇటు జనసేన పార్టీలకు చెందిన నాయకులు ఇప్పటికే మేస్త్రీల పోస్టులకు బహిరంగ మార్కెట్‌లో బేరంపెట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- ● ఒంగోలు నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో మేస్త్రీల తొలగింపు
- ● ఏళ్ల తరబడిపనిచేస్తున్న 108 మంది నోటిమాటతో ఊస్టింగ్
- ● కూటమి నేతల ఒత్తిడితోనే బరితెగింపు
- ● కమిషనర్ తీరుపై వెల్లువెత్తుతున్న నిరసనలు
- ● అమ్మకానికి పోస్టులు
- ● ఏరియాల వారీగా పంచుకుంటున్న కూటమి నేతలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల్లో ఎక్కడా లేనివిధంగా ఒక్క ఒంగోలు నగర పాలక సంస్థలోనే మేస్త్రీ వ్యవస్థ నిలిపేశారు. అధికార పార్టీ నేతల మితిమీరిన జోక్యం, వారికి అనుకూలంగా కమిషన్ వ్యవహరిస్తుండడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత కొత్త కమిషనర్‌గా కే.వెంకటేశ్వరరావు బాధ్యలు చేపట్టారు. ఆయన వచ్చిన తర్వాత మొదటి వేటు పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న మేస్త్రీలపై వేశారు. నోటి మాటతో వారిని తొలగించారు.

అధికార పార్టీ నేతలకు జీ హుజూర్....

అధికార కూటమి నాయకులు ఏది చెబితే అది కమిషనర్ ఆఘమేఘాలపై చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 15, 20 సంవత్సరాల నుంచి పారిశుద్ధ్య విభాగంలో మేస్త్రీలుగా పనిచేస్తున్న వారిని ఉన్నట్టుండి ఎందుకు ఆపాల్సి వచ్చిందో వారికే తెలియాలి. ఇప్పుడు పనిచేస్తున్న మేస్త్రీలు గత టీడీపీ ప్రభుత్వంలో కూడా పనిచేసిన వారే. అయినా వారిని తొలగించడంపై విమర్శలు గుప్పుమంటున్నాయి. పారిశుద్ధ్య విభాగంలో మొత్తం 108 మంది మేస్త్రీలు పనిచేస్తున్నారు. వీళ్లందరినీ తీసేసి టీడీపీ కూటమి పార్టీల నాయకులకు ధారాదత్తం చేయటానికేనన్న వాదనలూ వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకులు చెప్పారు కాబట్టి ''జీ హుజూర్'' అంటూ కమిషనర్ అమలు చేస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

బహిరంగ మార్కెట్లో పోస్టులు:

పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న మేస్త్రీలను నోటి మాటతో నిలిపేసిన సంగతి తెలిసిందే. దీంతో అధికార పార్టీకి చెందిన టీడీపీ కూటమి నాయకులు ఆయా పోస్టులను బహిరంగ మార్కెట్లో అమ్మకానికి పెట్టారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పనుల పరిశీలన పేరుతో కూటమి పార్టీలకు చెందిన కొందరిని కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు కూడా. అధికార పార్టీలకు చెందిన కార్యకర్తలైనా సరే కొందరు కార్పొరేటర్లు, ముఖ్య నాయకురాలు ఎవరికి వాళ్లు ఒక్కో పోస్టును రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు అమ్ముకోవటానికి రంగం సిద్ధం చేసుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏరియాల వారీగా సైతం పంచుకుంటున్నట్లు విశ్వసనీయ వర్గాల నుంచి వస్తున్న సమాచారం.

ఉద్యోగ భద్రత కల్పించిన అప్పటి సీఎం వైఎస్ జగన్:

2019 అధికారం చేపట్టిన అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కాంట్రాక్టు వ్యవస్థలో ఉన్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించారు. అప్పటి వరకు కాంట్రాక్టు వ్యవస్థలో పనిచేస్తున్న వారిని కాంట్రాక్టర్లు ఎప్పుడు పడితే అప్పుడు ఉద్యోగాలు పీకేయటంతో పాటు రాజకీయ కక్షలకు కాంట్రాక్టు వ్యవస్థలో ఉన్న ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భావించి రాష్ట్రంలో ఆప్కాస్ అనే ప్రభుత్వ సంస్థను ఏర్పాటు చేశారు. తద్వారా జీతాలు పెంచి, అలవెన్స్‌లు పెంచి ఉద్యోగ భద్రత కల్పించారు. అప్పటి నుంచి వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఆత్మ స్థైర్యం నెలకొంది. మళ్లీ టీడీపీ కూటమి అధికారంలోకి పరిస్థితి తారుమారైంది.

ఆపద సమయాల్లో ప్రాణాలకు తెగించి పనిచేసినా

ఒంగోలు నగరంలోని పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న మేస్త్రీలు, పారిశుద్ధ్య కార్మికులు ఆపద సమయాల్లో ప్రాణాలకు తెగించి పనిచేశారు. కోవిడ్ వరుసగా రెండు, మూడు సంవత్సరాల పాటు పారిశుద్ధ్య విభాగంలో మేస్త్రీలు, కార్మికులు ప్రాణాలకు తెగించి పనిచేశారు. కరోనా సోకిన వారి ఇళ్లకు వెళ్లి మరీ సేవలందించారు. విజయవాడ వరదల్లో కూడా ఒంగోలు నగరానికి చెందిన దాదాపు 300 మందికి పైగా కార్మికులు, మేస్త్రీలను విజయవాడ పంపించి మరీ పనిచేయించుకున్నారు. అయినా కనికరం లేకుండా నిలువునా ఆపేస్తే మా కుటుంబాలు ఏం కావాలని వారు బోరున విలపిస్తున్నారు.



నగర పాలక సంస్థ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న మేస్త్రీలు

మేస్త్రీ వ్యవస్థ ఉండదు...

నగర పాలక సంస్థలోని పారిశుద్ధ్య విభాగంలో ఇక నుంచి మేస్త్రీ వ్యవస్థ ఉండదు. వాళ్లు వర్కర్‌లుగానే చేరారు. వర్కర్‌గానే పనిచేయాలి. పనిచేయకుండా, కొందరు మస్టర్ కూడా వేసుకోకుండానే జీతాలు తీసుకుంటున్నారు. అందుకోసమే ప్రక్షాళన చేస్తున్నాను. ఇందులో రాజకీయ పార్టీ నాయకుల ప్రమేయం ఏమీ లేదు. పోస్టులు అమ్ముకుంటున్నారని అనుకోవటం వాస్తవం కాదు. అందరి చేత పనిచేయించి నగర అభివృద్ధికి పాటుపడాలన్నదే లక్ష్యంగా ముందుకు పోతున్నా.

– కే.వెంకటేశ్వర రావు, ఒంగోలు నగర కమిషనర్

నాయకులు అమ్ముకోవటానికే....



అధికార పార్టీ నాయకులు మేస్త్రీ పోస్టులను అమ్ముకోవటానికి నగర కమిషనర్ మేస్త్రీలను పక్కన పెట్టారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఈ ఉద్యోగాలను అమ్ముకోవటానికి వాటాలు వేసుకుంటున్నారు. పార్టీ కార్యకర్తలు, వాళ్ల పేరుతో ఇతరులకు ఈ ఉద్యోగాలను అమ్ముకునేందుకు ఇప్పటికే బేరాలు పెట్టారు. 20 సంవత్సరాల నుంచి సేవలు అందిస్తున్న వారిని ఉద్యోగం నుంచి తీసేయటం అత్యంత దుర్మార్గం. దీనిని సీఐటీయూ యూనియన్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నాం.

– టీ.మహేష్, సీఐటీయూ ఒంగోలు నగర కార్యదర్శి

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా..



రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఒక్క ఒంగోలు నగరంలోని పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులను తొలగించారు. కనీసం ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా తీసేయటం దుర్మార్గం. రాష్ట్ర ప్రభుత్వం మేస్త్రీ వ్యవస్థను తీసేయాలని కనీసం సర్క్యులర్ కూడా జారీ చేయలేదు. ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై వాళ్ళు ఏది చెబితే అది చేస్తున్నారు. కార్మికుల్లో చిచ్చు పెట్టి కొందరిని తిరిగి మేస్త్రీలుగా కొనసాగిస్తానని వాళ్లకు మాయమాటలు చెప్పి ధర్నాకు రాకుండా చేస్తున్నాడు కమిషనర్. కార్మికులను విభజించి పాలిస్తున్నాడు.

– కొర్నిపాటి శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరి

- ● డిసెంబర్ 5 వరకు కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల మరమ్మతులు
- ● కలెక్టర్ తమీమ్ అన్సారియా



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రతి ఒక్కరూ ఇంటికి మరుగుదొడ్డి ఉండేలా చూడాలని వాటిని శుభ్రంగా ఉంచుకుంటూ వినియోగించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రకాశం భవనంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దీనిలో హరిత అంబాసిడర్‌లను సత్కరించారు. అనంతరం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవానికి సంబంధించిన అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 19 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్‌ల మరమ్మతులపై దృష్టి సారించాలని వాటిని ప్రజలు పూర్తిగా వినియోగించుకునేలా ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించాలన్నారు. పాఠశాలలు, వసతిగృహాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని మరుగుదొడ్ల నిర్వహణపై సంబంధిత అధికారులు దృష్టి సారించి ఏవైనా మరమ్మతులు ఉంటే చేపట్టాలన్నారు. మరుగుదొడ్ల ఆవశ్యకతపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. 'మా టాయిలెట్ మా గౌరవం' అనే నినాదం ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. మరుగుదొడ్ల మంజూరుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. దీనిలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ వెంకటనాయుడు, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, డీఈఓ కిరణ్‌కుమార్, వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైపాలెం టీడీపీలో రచ్చ

- ● మంగళగిరి పార్టీ కార్యాలయానికి చేరిన పంచాయితీ
- ● పార్టీకి తలనొప్పిగా మారిన ఎరిక్షన్ బాబు
- ● బియ్యం, లిక్కర్ మాఫియాలకు వత్తాసు
- ● డబ్బులు గుంజి అవినీతి అధికారులను బదిలీ చేయించని వైనం
- ● ఆవేదన వ్యక్తం చేసిన నియోజకవర్గ టీడీపీ నేతలు



మంగళగిరిలోని టీడీపీ కార్యాలయానికి చేరిన యర్రగొండపాలెం నాయకులు

యర్రగొండపాలెం: యర్రగొండపాలెం టీడీపీలో నాయకుల మధ్య పంచాయితీ మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాయానికి చేరింది. నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జిగా చెలామణి అవుతున్న గూడూరి ఎరిక్షన్ బాబు తలనొప్పిగా మారాడని, పార్టీని రెండు వర్గాలుగా విభజించి తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని ఆ పార్టీకి చెందిన ఒక వర్గం మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయానికి వెళ్లి అక్కడి నేతలతో మొరపెట్టుకున్నారు. ఎరిక్షన్ బాబు అరాచకాలను తట్టుకోలేక మంగళవారం మండలం నుంచి దాదాపు 40 వాహనాల్లో 250 మంది ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. ప్రధానంగా నియోజకవర్గంలో ప్రతినెలా నజరానాలు సమర్పించుకునే 10 మంది బియ్యం, లిక్కర్ మాఫియాలకు ఆయన వత్తాసు పలుకుతున్నాడని పార్టీ పెద్దలకు తెలిపారు. పెద్దమొత్తాల్లో డబ్బులు గుంజి పంచాయతీరాజ్ డీఈ సుబ్బారెడ్డి, యర్రగొండపాలెం పంచాయతీ కార్యదర్శి రాజశేఖరరెడ్డి తాము ఉద్యోగాలు చేపట్టి 5 సంవత్సరాలు దాటినప్పటికీ వారిని స్థాన చలనం చేయకుండా తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. గ్రామాల్లో నీళ్ల తోలకుండా బిల్లులు చేయించుకునేవారికే పెద్దపీట వేస్తున్నాడని, మండలంలోని మురారిపల్లెలో తన అనుమతిలేకుండా ఉచితంగా నీళ్ల సరఫరా చేస్తున్న రమణారెడ్డిపై కక్షకట్టి తాగే నీటిలో తన మనుషులతో పురుగుల మందు కలిపించాడని, అంతేకాకుండా పోలీసులను ఇంటిపైకి పంపి తీవ్ర ఇబ్బందులకు గురిచేశాడని వారు ఆరోపించారు. పార్టీ అభివృద్ధి కోసం కాకుండా తన అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా పెట్టుకొని అందినకాడికి డబ్బులు గుంజి వెనకేసుకుంటున్నాడని వారు ఆవేదన వ్యక్త చేశారు. వెంటనే నియోజకవర్గ ఇన్‌చార్జిని నియమించాలని లేకుంటే రెండు, మూడు రోజులకు ఒక మండలం నుంచి టీడీపీ వర్గీయులు అధిక సంఖ్యలో కేంద్ర కార్యాలయానికి రావలసి వస్తోందని వారు వాపోయారు. టీడీపీ రాష్ట్ర నాయకులు షరీఫ్, వర్ల రామయ్య, రాంబాబులతో కలిసి నియోజకవర్గంలో ఉన్న పార్టీ పరిస్థితుల గురించి వివరించినట్లు వారు తెలిపారు. మంగళగిరికి వెళ్లినవారిలో ఆ పార్టీ నాయకులు చేకూరి ఆంజనేయులు, వడ్డముడి లింగయ్య, షేక్ జిలానీ, పోతిరెడ్డి రమణారెడ్డి, నాగరాజు వెంకటేశ్వర్లు, వెన్నా వెంకటరెడ్డి ఉన్నారు.

సొంత వైద్యం ఆరోగ్యానికి చేటు



ర్యాలీ నిర్వహిస్తున్న ఫార్మ డీ విద్యార్థులు

ఒంగోలు టౌన్: సొంత వైద్యం ఆరోగ్యానికి చేటు చేస్తుందని, ఒక్కోసారి తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని క్విస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీకి చెందిన ఫార్మా డీ విభాగం హెచ్ఓడీ డా.చంద్రకళ చెప్పారు. నేషనల్ ఫార్మసీ వీక్ సెలబ్రేషన్స్‌ను పురస్కరించుకొని మంగళవారం జీజీహెచ్‌లో ఫార్మా డీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. థింక్ హెల్త్, థింక్ ఫార్మసీ నినాదంతో ర్యాలీ నిర్వహించిన ర్యాలీలో జీజీహెచ్‌లోని రోగులకు ఔషధాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఏదైనా అనారోగ్యం చేసినప్పుడు వైద్యుడిని సంప్రదించిన తరువాత వారు సూచించిన మందులు మాత్రమే వాడాలని చంద్రకళ చెప్పారు. వైద్యులు రోగి వయసు, బరువుకు తగిన డోసును నిర్ధారించిన మందులు సూచిస్తారని, వారు చెప్పిన సమయం ప్రకారం వాటిని వాడడం సురక్షితమని తెలిపారు. మందులు వాడే సమయంలో తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. ఈ ర్యాలీలో ఫార్మసీ విజిలెన్స్ హెడ్ డా.ఝాన్సీ, ప్రిన్సిపాల్ ఎం.కిశోర్ బాబు, ఫార్మసీ విభాగం హెచ్ఓడీ డా.జాలిరెడ్డి పాల్గొన్నారు.

మనల్నెవర్రా ఆపేది...



జేసీబీతో మట్టిని తవ్వుతున్న దృశ్యం

- ● యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా
- ● చోద్యం చూస్తున్న అధికారులు



టిప్పర్ లారీలతో తరలిస్తున్న చెరువు మట్టి

మార్కాపురం రూరల్: కూటమి నాయకులకు మట్టి బంగారంలాగా మారింది. అధికారంలోకి రాగానే ఇసుక, మట్టిని తమ కబంద హస్తాల్లో ఉంచుకుని లక్షల రూపాయలను అర్జిస్తున్నారు. మార్కాపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన టీడీపీ నేత మట్టిని తవ్వడం.. అమ్ముకోవడం.. వ్యాపారంగా మార్చుకుని అధికారులకు తమ నేత పేరును చెబుతూ బెదిరించుకుంటూ పగలు రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా జేసీబీల సాయంతో చెరువుల్లో తవ్వేస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు అధికార పార్టీని చూసి వెనక్కు తగ్గుతున్నారు. దీంతో ఆ నేత మనల్నెవ్వర్రా ఆపేదంటూ..ట్రాక్టర్ మట్టిని వెయ్యి రూపాయలు, టిప్పర్ అయితే రూ.4 వేలకు విక్రయిస్తున్నాడు. కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టేవారు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మట్టి అవసరం బాగా ఉంది. దీనిని సదరు టీడీపీ నేత సొమ్ము చేసుకుంటున్నాడు. దీంతో మార్కాపురం ప్రాంతంలోని పలు చెరువుల రూపురేఖలు మారిపోతున్నాయి. చెరువు మధ్యలోనూ, అంచుల వెంట కూడా జేసీబీతో తవ్వడంతో వర్షాలకు నీరొస్తే కట్ట తెగే ప్రమాదం ఉంది. గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదు. మండలంలోని నికరంపల్లి, వేములకోట, యాచవరం, నాగులవరం తదితర గ్రామాల్లో ఉన్న చెరువుల్లోని మట్టిని పట్టపగలే మట్టిమాఫియా తరలిస్తున్నా అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ తతంగమంతా అధికారుల కనుసన్నల్లో జరుగుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే మట్టి మాఫియాను అడ్డుకోవాలంటూ రైతు సంఘం నాయకులు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు మట్టి మాఫియాను అడ్డుకొని చెరువులను కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సైనికుల బైక్ ర్యాలీ

● ర్యాలీ ప్రారంభించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: మాజీ సైనికులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రకాశం భవనం వద్ద కలెక్టర్ తమీమ్ అన్సారియా జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. మద్రాస్ ఇంజినీరింగ్ గ్రూప్ 244వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆ గ్రూపునకు చెందిన సైనికులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు జ్ఞాపికలు అందజేశారు. ఇటీవల వాయనాడులో మంద్రాసు ఇంజినీరింగ్ గ్రూపు సభ్యులు నిర్వహించి సాహసోపేతమైన బైక్ స్టంట్‌లను కొనియాడారు. దీనిలో సైనిక సంక్షేమ అధికారి రజనీకుమారి, మాజీ సైనిక సంఘం సభ్యులు నెప్పలి నాగేశ్వరరావు, శ్రీరామమూర్తి, మాజీ సైనికులు, ఎన్‌సీసీ కాడెట్స్ పాల్గొన్నారు.



బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

క్లుప్తంగా

మార్కాపురం మీదుగా శబరికి ప్రత్యేక రైలు

మార్కాపురం: మచిలీపట్నం నుంచి కొల్లాం వెళ్లే శబరిమల రైలు మార్కాపురం రోడ్ స్టేషన్‌మీదుగా ప్రయాణిస్తుందని, అయ్యప్ప మాలధారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని గుంటూరు డీఆర్‌యూసీసీ మెంబర్ ఆర్‌కేజే నరసింహం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం-కొల్లాం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు(07147) డిసెంబర్ 23, 30వ తేదీల్లో మచిలీపట్నం నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి సాయంత్రం 5.58 గంటలకు మార్కాపురం రోడ్ రైల్వేస్టేషన్ చేరుతుందన్నారు. మార్కాపురం నుంచి 6 గంటలకు బయలుదేరి నంద్యాల, రేణిగుంట, కోయంబత్తూర్, ఎర్నాకుళం టౌన్ మీదుగా మరుసటి రోజు రాత్రి 9.20 గంటలకు కొల్లాం చేరుతుందని వివరించారు. కొల్లాం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు(07148) డిసెంబర్ 25, జనవరి 1వ తేదీన కొల్లాం నుంచి తెల్లవారుజామున 2.30 గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు. 22 అధునాతన బోగీలతో ఈ రైలును ఏర్పాటు చేశారని, ఏసీ సౌకర్యం కూడా ఉందని తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన యోహాను

దర్శి: ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని తూర్పు వీరాయపాలెం గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గంధం యోహాను (33) మోటారు సైకిల్‌పై దర్శి నుంచి బొట్లపాలెం వెళుతున్నాడు. ఈ క్రమంలో మోటారుసైకిల్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టి కిందపడ్డాడు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. యోహాను మృతి విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మల్లెతోటలో చోరీ

- రూ.లక్ష నగదు, 12 గ్రాముల బంగారం అపహరణ

సింగరాయకొండ: ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చోరీకి పాల్పడి రూ.లక్ష నగదు, 12 గ్రాముల బంగారాన్ని అపహరించారు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున మండల కేంద్రంలోని మల్లెతోట-4వ లైన్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. షేక్ మహమ్మద్ రఫీ, ఇమాంబీలు పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలో పొగాకు బ్యారన్ల ఇనుప గొట్టాలు అమ్మే వ్యాపారం చేస్తుంటారు. వ్యాపార నిమిత్తం ఎక్కువ శాతం అక్కడే ఉంటారు. అప్పుడప్పుడు ఇక్కడకి వచ్చి వెళుతుంటారు. ఈ క్రమంలో ఇటీవల ఇంటికి వచ్చిన రఫీ, ఇమాంబీలు అప్పు తీర్చేందుకు నగదు తెచ్చి ఇంట్లో ఉంచామని, సోమవారం ఊరెళ్లామని తిరిగి వచ్చేలోగా చోరీ జరిగిందని వాపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది.

డెంగీతో మహిళ మృతి

పీసీపల్లి: మండల పరిధిలోని గోపవరపువారిపల్లికి చెందిన మూలే కామేశ్వరి (24) మూడు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతూ మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు మృతి చెందింది. ఈమె డెంగీ లక్షణాలతో చనిపోయినట్లు బంధువులు తెలిపారు. ఈమెకు భర్త రమణారెడ్డి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఇప్పటి వరకు గ్రామంలో ఎటువంటి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేయలేదు. దీంతో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో బ్లీచింగ్, దోమలు నివారణ కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పత్తి రైతుకు ధరాఘాతం

- ప్రారంభం కాని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం
- క్వింటా రూ.6 వేలకే దళారులకు అమ్ముకుంటున్న రైతులు
- గిట్టుబాటు ధర దక్కడం లేదని ఆందోళన
- పశ్చిమాన 8,840 హెక్టార్లలో పత్తి పంట సాగు
- గత ఏడాది మధ్యస్థ రకం పత్తి క్వింటా మద్దతు ధర రూ.7020



పత్తి ధరలు రైతులను తీవ్ర నిరాశా నిస్పృహల్లోకి నెడుతున్నాయి. గడిచిన మూడేళ్లుగా ఆశించిన స్థాయిలో ధర పలికిన పత్తికి ఈ ఏడాది పెట్టుబడి సొమ్ము కూడా చేతికందే పరిస్థితి లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గులాబీ పురుగు ఉధృతి, గత నెలలో వారం రోజులపాటు కురిసిన వర్షాలకు పత్తి చేలు ఉరకెత్తడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. దీనికి తోడు మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రైతుల పరిస్థితి మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా మారింది. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర దక్కనీయకుండా చేస్తుండటంతో ఏమి చేయాలో దిక్కు తెలియక రైతులు రోడ్డెక్కి నిరసన తెలిపే పరిస్థితులు దాపురించాయి.


వేములకోటలో సాగవుతున్న పత్తి

మార్కాపురం సబ్ డివిజన్‌లో పత్తి సాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం(హెక్టార్లలో)
మార్కాపురం	2500
తర్లుపాడు	60
గిద్దలూరు	123
బేస్తవారిపేట	267
రాచర్ల	684
యర్రగొండపాలెం	882
పుల్లలచెరువు	1446
త్రిపురాంతకం	171
పెద్దారవీడు	1079
కంభం	70
దోర్నాల	882
అర్ధవీడు	673

మార్కాపురం: జిల్లాలో మార్కాపురం డివిజన్‌లో పత్తి సాగు విస్తీర్ణం అధికంగా ఉంది. పశ్చిమ ప్రకాశంలో ఈ ఏడాది సుమారు 8,840 హెక్టార్లలో పత్తి పంటను రైతులు సాగు చేశారు. మార్కాపురం డివిజన్‌లోని 12 మండలాలతోపాటు కందుకూరు డివిజన్‌లోని తర్లుపాడు, పొదిలి, కొనకనమిట్ల, దర్శి, మర్రిపూడి, కనిగిరి ప్రాంతాల్లో పత్తి తీత ప్రారంభించారు. జూన్, జూలైలో సాగు చేసిన పత్తి దిగుబడి వస్తుండగా, కొద్దిగా ఆలస్యంగా సాగు చేసిన పత్తి మరో రెండు మూడు రోజుల్లో తీతకు రానుంది.


గ్రామాల నుంచి లారీల ద్వారా గుంటూరుకు తరలిస్తున్న పత్తి

సర్కారు నిర్లక్ష్యం దళారులకు వరం

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఇప్పటి వరకు మార్కాపురంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడం దళారులకు వరంగా మారింది. రైతులు తాము పండించిన పత్తిని దళారులు చెప్పిన ధరకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దళారులు క్వింటా పత్తికి రూ.5500 నుంచి రూ.6 వేలు మాత్రమే ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది మధ్యస్థ రకం పత్తి మద్దతు ధర 7020గా ఉండగా క్వింటా పత్తిని రైతులు రూ.12 వేల వరకు అమ్ముకున్నారు. గత నెలలోనూ క్వింటా రూ.8 వేల వరకు పలికిన పత్తి ధర.. సరిగ్గా దిగుబడి చేతికొచ్చే సమయంలో నేల చూపులు చూడటం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. గత ఏడాది అక్టోబర్ 30న మార్కాపురం మార్కెట్ యార్డులో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. క్వింటా పత్తి కనీస మద్దతు ధర 7020 ప్రకటించడంతో రైతులు యార్డుకు తెచ్చి పత్తిని అమ్మారు. ఈ సీజన్‌లో కూడా సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటవుతుందని రైతులు ఆశించగా, ఇంత వరకు కొనుగోలు కేంద్రాన్ని మార్కాపురంలో ప్రారంభించలేదు.

పెట్టుబడి చేతికొచ్చేనా?

క్వింటా పత్తికి రూ.9 వేలు దక్కితేనే గిట్టుబాటు అవుతుందని రైతులు ఆశిస్తున్నా ప్రస్తుతం ఆ పరిస్థితులు కనిపించడం లేదు. రోజూ పశ్చిమ ప్రకాశం నుంచి సుమారు 10 నుంచి 15 లారీల పత్తి గుంటూరు మార్కెట్ యార్డుకు తరలిస్తున్నారు. కొంత మంది రైతులు గ్రూపుగా ఏర్పడి లారీలను బాడుగకు మాట్లాడుకుని ఒక్కో లారీలో 150 క్వింటాళ్ల పత్తిని గుంటూరు చేరుస్తున్నారు. ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టి వ్యయప్రయాసలకోర్చి పండించిన పత్తికి గిట్టుబాటు ధర దక్కకపోతుండటంతో పెట్టుబడి కూడా చేతికి రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం

సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని మార్కాపురం మార్కెట్ యార్డులో ప్రారంభించాలని ఉన్నతాధికారులను కోరాం. త్వరలోనే కేంద్రం ప్రారంభం కానుంది. రైతులు పండించిన పత్తిని ఇక్కడే అమ్ముకోవచ్చు.

– కోటేశ్వరరావు, కార్యదర్శి, మార్కాపురం మార్కెట్ యార్డు


వ్యవసాయ మార్కెట్ యార్డు

జీజీహెచ్‌లో కంగారు మదర్ కేర్ సెంటర్

- కలెక్టర్ తమీమ్ అన్సారియా వెల్లడి

ఒంగోలు టౌన్: బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా ఒంగోలు జీజీహెచ్‌లో కంగారు మదర్ కేర్ సెంటర్(కేఎంసీ) ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా వెల్లడించారు. మంగళవారం ఆమె జీజీహెచ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. న్యూ బార్న్ మదర్ కేర్ కార్యక్రమంలో భాగంగా కనిగిరి సీహెచ్‌సీలో కేఎంసీ పైలట్ ప్రాజెక్టు చేపట్టేందుకు శరవేగంగా పనులు సాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో పలు ప్రాంతాలకు విస్తరించే ప్రణాళికలో భాగంగా జీజీహెచ్‌లోని గైనిక్, నవజాత శిశు విభాగాలను పరిశీలించినట్లు తెలిపారు. కంగారు తన పిల్లలను సహజసిద్ధమైన పొత్తిళ్లలో దాచి ఎలా సంరక్షిస్తుందో అదే తరహాలో నెలలు నిండకుండా పుట్టిన శిశువులను, బరువు తక్కువగా పుట్టిన చిన్నారులను కాపాడేందుకు కేఎంసీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వివరించారు. సరైన విధానంలో పాలు పట్టడం, పోషణ, శుభ్రత తదితర అంశాలపై తల్లుకు అవగాహన కల్పించడమే కేఎంసీ ముఖ్య ఉద్దేశమని చెప్పారు.


జీజీహెచ్‌లో చిన్నారుల వార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

టాయిలెట్ల నిర్వహణపై అసంతృప్తి

సుమారు రెండు గంటలపాటు జీజీహెచ్‌లోని లేబర్ రూమ్‌తోపాటు గైనిక్ వార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. వార్డులు, మరుగుదొడ్లలో అపరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత హెడ్ నర్సులకు చార్జ్ మెమో ఇవ్వాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. జీజీహెచ్‌లో ప్రసవాల తీరు, క్రిటికల్ కేర్ ప్రొసీజర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నవజాత శిశు కేంద్రాన్ని, పోషకాహార కేంద్రాన్ని పరిశీలించిన ఆమె పిల్లలతో గడిపారు. కలెక్టర్ వెంట జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్, పలువురు హెచ్‌ఓడీలు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందంజ

ఒంగోలు టౌన్: చదువుతో మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో కొనసాగాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ జి. అర్చన అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి, అసిస్టెంట్ లైబ్రేరియన్ కె. సంపూర్ణ ఆధ్వర్యంలో సభ జరిగింది. సభకు పలువురు మహిళా అధికారులు, కవయిత్రులు హాజరయ్యారు. ప్రపంచంలో మహిళలు అడుగు పెట్టని రంగం లేదని, అడుగు పెట్టిన ప్రతి చోట విజయం సాధించారని బీసీ వెల్ఫేర్ అధికారి ఎం. అంజల చెప్పారు. సంప్రదాయాలను గౌరవిస్తునే స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోవాలని, అప్పుడు మాత్రమే ముందడుగు వేయడం సాధ్యమౌతుందని డ్వామా విజిలెన్స్ అధికారి ఝాన్సీ పేర్కొన్నారు. వివిధ రంగాల్లో విజయం సాధించిన మహిళామూర్తులను ఆదర్శంగా తీసుకోవాలని మైనారిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. ధనలక్ష్మి పిలుపునిచ్చారు. దేశ చరిత్రలో ధీరవనితలుగా నిలిచిన ఇందిరాగాంధీ, ఝాన్సీ లక్ష్మిబాయిలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని సభకు అధ్యక్షత వహించిన కవయిత్రి తేళ్ల అరుణ చెప్పారు. తొలుత ఇందిరాగాంధీ, ఝాన్సీ లక్ష్మిబాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు. కవయిత్రులు మానేపల్లి సూర్యకుమారి, సింహాద్రి జ్యోతిర్మయి, పరాంకుశం కృష్ణవేణి, బీరం అరుణ, సునీత, పుణ్య కీర్తన, సంతోషిణి చదివిన కవితలు, గాయకుడు నూకతోటి శరత్‌కుమార్ పాడిన పాట ఆకట్టుకున్నాయి.


జిల్లా గ్రంథాలయంలో జరిగిన కవి సమ్మేళనంలో కవితలు వినిపిస్తున్న కవయిత్రులు

డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ


డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ ఇస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: డ్రోన్ టెక్నాలజీ వినియోగంపై మహిళా పోలీసులకు ప్రత్యేక శిక్షణకు శ్రీకారం చుట్టారు. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎస్పీ ఏఆర్ దామోదర్ స్వయంగా డ్రోన్ ఆపరేట్ చేసి దాని వినియోగాన్ని మహిళా పోలీసులకు వివరించారు. ప్రతి మహిళా పోలీసు డ్రోన్ పైలెట్‌గా శిక్షణ పొందాలని సూచించారు. జిల్లాలోని పోలీసులందరికీ డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కల్పిస్తామని, ఇప్పటి వరకు జిల్లాలో 300 మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలో డ్రోన్ డివైస్ పోలీసింగ్ చేపడతామని, డ్రోన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేస్తామని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, వివిధ బందోబస్తులు, జాతరలు, ఊరేగింపుల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్ టెక్నాలజీని ఉపయోగిస్తామన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణ, విపత్తులను ఎదుర్కోవడానికి కూడా డ్రోన్లు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని చెప్పారు. హైవేలపై బైక్ రేసులను అరికట్టడానికి ఇకపై డ్రోనులను విరివిగా ఉపయోగించనున్నట్లు చెప్పారు. ఈవ్‌టీజింగ్, నాటుసారా తయారీ, అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ల ద్వారా నిఘా పెడతామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కేవీ రాఘవేంద్ర , ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ వి. సూర్యనారాయణ, పీసీఆర్ ఇన్‌ప్రభాకర్ రెడ్డి, తాలుకా పీఎస్ ఎస్సైలు కృష్ణ పావని, అనిత పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థినుల సత్తా


విజేతలైన క్రీడాకారులతో ప్రిన్సిపాల్ రమాదేవి

సింగరాయకొండ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల మూడవ జోన పోటీల్లో పాఠశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరచారని ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు పల్నాడు జిల్లా ఉప్పలపాడు గురుకుల పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో 40 మంది విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారన్నారు. సీనియర్ వాలీబాల్, జూనియర్ వాలీబాల్, జూనియర్ త్రోబాల్ పోటీల్లో విన్నర్స్‌గా నిలిచారన్నారు. అథ్లెటిక్స్‌లో 1500 మీటర్ల విభాగంలో మొదటి స్థానం, 800 మీటర్ల విభాగంలో మొదటి, మూడవ స్థానాలు, 4..100 మీటర్ల విభాగంలో మొదటి స్థానం, డిస్కస్‌త్రోలో రెండవ స్థానం, లాంగ్‌జంప్‌లో రెండవ స్థానం, జావలిన్ త్రోలో రెండు, మూడు స్థానాలు సాధించటమే కాక గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పీడీ ఎస్ సుధారాణి, పీఈటీ బి.అరుణకుమారి, విద్యార్థినులను ఎంపీడీఓ డి. జయమణి, ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ వసుధలను అభినందించారు.

జాతీయ నూతన విద్యా విధానంతో నష్టం

- ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య


మాట్లాడుతున్న ఈశ్వరయ్య

పొదిలి: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జాతీయ నూతన విద్యా విధానంతో నష్టం జరుగుతుందని విద్యార్థులు అనేక కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య అన్నారు. ఏఐఎస్ఎఫ్ 20వ జిల్లా మహాసభలు పొదిలిలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈశ్వరయ్య మాట్లాడుతూ విద్యను పూర్తిగా కాషాయీకరణ, కార్పొరేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని విమర్శించారు. రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పిన మూడోసారి గద్దె నెక్కిన నరేంద్ర మోదీ ఎక్కడ ఎవరికి, ఎప్పుడు ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థి లోకం సమరశీల పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, వసతి దీవెన బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుల్లాయి స్వామి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని యూనివర్సిటీకి సొంత భవనాలతో పాటు, హాస్టల్ వసతి కల్పించాలన్నారు. ముందుగా విద్యార్థులు పెద్ద బస్టాండ్ నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కరుణానిధి, జిల్లా సహాయ కార్యదర్శి రామంజనేయులు, మాజీ జిల్లా కార్యదర్శి పి.ప్రభాకర్, సీపీఐ కార్యదర్శి కేవీ రత్నం, జిల్లా నాయకులు పవన్ కళ్యాణ్, స్టాలిన్, ఎంఎల్ నారాయణ, నాసరయ్య, జీపీ రామారావు, కొండయ్య పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడల్లో విద్యార్థినులు రాణించాలి


క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న రిజిస్ట్రార్

ఒంగోలు: నేటి కంప్యూటర్ యుగంలో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని, పోటీతత్వాన్ని పెంపొందించేందుకు చదువుతోపాటు సంప్రదాయ క్రీడలు ఎంతో అవసరమని ఆంధ్రకేసరి యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఏకేయూ ప్రాంగణంలో నిర్వహించిన మహిళల అంతర్ కళాశాలల మహిళల కబడ్డీ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోటీలను యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రాజమోహన్‌రావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డీడీ డాక్టర్ ఐ.దేవీ వరప్రసాద్‌తో కలిసి రిజిస్ట్రార్ ప్రారంభించారు. 8 కళాశాలలకు చెందిన 24 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. మంగళవారం నిర్వహించిన పోటీలు హోరాహోరీగా సాగాయి. ఫైనల్స్ అనంతరం ఏకేయూ తరఫున పాల్గొనే జట్టును ఎంపిక చేయనున్నారు. ఏకేయూ కాలేజ్ డెవలపమెంట్ కౌన్సిల్ డీన్ ప్రొఫెసర్ జి. సోమశేఖర, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. వివిధ కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీలను ఆసక్తిగా తిలకించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలపై మహాధర్నా



మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 26వ తేదీ కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ జిల్లా అధ్యక్షుడు చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మంచిపుస్తకం వద్ద మహాధర్నా కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయదారులు, కార్మికుల ప్రయోజనాలకు భంగం కలిగిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అలంబిస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో రాజ్యాంగ దినోత్సవం రోజైన ఈ నెల 26వ తేదీ దేశ వ్యాప్తంగా 500 జిల్లా కేంద్రాల్లో మహాధర్నా చేపట్టినట్లు వివరించారు. ఈ ధర్నాకు కూడా కేంద్రం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావల సుధాకర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా ప్రజల ప్రాథమిక హక్కులు, లౌకికతత్వం, ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు భీమవరపు సుబ్బారావు, పి.పేరయ్య, డా.శ్రీనివాసులు యాదవ్, పేరం సత్యం, పిన్నికి శ్రీనివాస్, లింగా వెంకటేశ్వర్లు, మస్తాన్‌రావు, దాసరి సుందరం, కరవది సుబ్బారావు, ఎం జార్జి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

కొండపి: బంగారం చోరీ కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కొండపిలోని స్థానిక వెంకటేశ్వర కాలనీలో నివాసముంటున్న ముప్పరాజు లక్ష్మి ఇంట్లో తన బంగారం చోరీ జరిగిందని సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టగా..దర్యాప్తులో లక్ష్మి నివాసంలోకి బంధువైన శివానీ, శివానీ మిత్రులైన శారదా, సురేష్ వచ్చారు. వారు వచ్చిన వెళ్లిన తరువాతే బంగారం కనిపించ లేదు. దీంతో పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేయగా మంగళవారం అనకర్లపూడి, మద్దులూరు గ్రామాల మధ్య ముసీ వాగు సమీపంలో బంగారం తీసుకుని వెళుతున్న వారిని ఎస్సై ప్రేమ్ కుమార్ సిబ్బంది చాకచక్యంగా అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 56 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పర్యాటక కేంద్రంగా కంభం చెరువు

- చెరువును పరిశీలించిన సబ్ కలెక్టర్


టూరిజం అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

కంభం: చారిత్రాత్మక కంభం చెరువును మంగళవారం మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, టూరిజం డెవలప్‌మెంట్ అధికారి టి. బెనర్జీ పరిశీలించారు. చెరువుకట్ట చరిత్రను, ఆయకట్టు వివరాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. చారిత్రాత్మక కంభం చెరువుకట్ట ముఖ ద్వారం వద్ద చెరువు ప్రాముఖ్యతను తెలిపేలా డిస్‌ప్లే బోర్డు ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్ సూచించారు. కంభం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన వనరులు, ఇతర సౌకర్యాలు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. కంభం చెరువు ఆయకట్టు కింద ఉన్న ప్రధాన ఇరిగేషన్ కాలువలు పట్టణంలో నుంచి వెళ్తున్నాయని, అవి పూర్తి స్థాయిలో ఆక్రమణలకు గురయ్యాయని ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని ఆక్రమణలను తొలగించాలని ఎంఆర్పీయస్ నాయకులు పానుగంటి షాలెంరాజు, నేదరపల్లి జయరాజ్ సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో రోజు రోజుకు ఆక్రమణలు పెరిగిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, ఇరిగేషన్ ఏఈ నాయక్, ఉద్యానవన శాఖ అధికారి శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నాసర్ మహమ్మద్ వలి గంధ మహోత్సవం



పొదిలి రూరల్: పొదిలి మండలంలోని మదాలవారిపాలెంలో నాసర్ మహమ్మద్ వలి గంధ మహోత్సవాన్ని మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా వేలాది మంది భక్తులు ఉరుసు మహోత్సవంలో పాల్గొన్నారు. తిరునాళ్ల సందర్భంగా దర్గాతో పాటు రామాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం రాత్రి ప్రతి ఇంటి నుంచి జెండాల ఊరేగింపుతో దర్గాకు చేరుకుని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. పొదిలి నుంచి ముస్లింలు ప్రత్యేక వాహనంలో గంధం తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


విద్యుత్ వెలుగుల్లో రామాలయం, నాసర్ మహమ్మద్‌వలి దర్గా